ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.4 : కనిష్ఠం 25.0



- ప్రభుత్వం పలుమార్లు బదిలీలు చేసినా కదలని అధికారులు
- దీర్ఘకాలికంగా జిల్లాలోనే కొనసాగింపు
- మళ్లీ బదిలీ ఉత్తర్వులు రావడంతో పైరవీలతో జిల్లాలోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు
- ఇతర జిల్లాలకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్న కొందరు అధికారులు



పైరవీల జోరు!

నిజామాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం సాధారణ బదిలీలతోపాటు ప్రత్యేక బదిలీలను చేపట్టినా కొంతమంది ఉద్యోగులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఎన్ని ఉత్తర్వులు ఇచ్చినా వాటిలోని కొన్ని అంశాలను అనుకూలంగా మార్చుకొని జిల్లాను వదిలి వెళ్లేందుకు సిద్ధపడటం లేదు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తూ స్థానిక నేతలతో కలిసి చక్రం తిప్పుతున్నారు. బదిలీ ఉద్యోగులకు తప్పనిసరి అయిన తమకున్న పరపతిని ఉపయోగించి జిల్లాను దాటడం లేదు.

ఏళ్ల తరబడి ఒకేచోట..

జిల్లాలో కొందరు ఉద్యోగులు ఏళ్లతరబడి ఒకేచోట పనిచేస్తూ తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఎన్నికలు, ఇతర అంశాలు వచ్చినప్పుడు ఇతరశాఖలకు డిప్యుటేషన్‌పై వెళ్లి వెంటనే తమ పరపతిని ఉపయోగించి మాతృశాఖకు వస్తున్నారు. కొంతమంది నేతల సహకారంతో ఇక్కడే కొనసాగుతుండగా మరికొంతమంది అనారోగ్యాలు, ఇతర కారణాలు చూపుతూ జిల్లాను దాటడంలేదు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తూ ఉద్యోగంతోపాటు పలు వ్యాపారాలను కూడా కొంతమంది నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారుల నుంచి రాష్ట్ర అధికారుల వరకు పరిచయాలు పెంచుకొని కొనసాగుతున్నారు. ప్రభుత్వం నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారిని బదిలీ చేయాలని ఉత్తర్వులు ఇవ్వడంతో మళ్లీ జిల్లాలోనే ఉండేలా కొనసాగేందుకు పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాను వీడని అధికారులు

జిల్లాలోని కొన్ని శాఖల్లో కిందిస్థాయి ఉద్యోగంలో చేరిన ఉద్యోగులు పదోన్నతులు పొంది అధికారులుగా మారారు. ఏళ్లతరబడి జిల్లాలోనే పనిచేశారు. ఉమ్మడిజిల్లా నుంచి కొత్త జిల్లాగా ఏర్పడిన కామారెడ్డిలో సైతం కొంతమంది జిల్లా నుంచి కదలలేదు. మరికొంతమంది తప్పనిసరి వెళ్లి తర్వాత తిరిగొచ్చేశారు. కొంతమందికి ఎన్నికల్లో ఇతర జిల్లాలకు బదిలీ అయిన అవి పూర్తికాగానే వివిధ కారణాలు చూపి జిల్లాకు వచ్చారు. ఉద్యోగి నుంచి అధికారిగా మారిన తర్వాత వారి క్యాడర్‌ను బట్టిజోన్ పరిధిలో కానీ, మల్టీజోన్ పరిధిలోకాని పనిచేయాలి. కొంతమంది అవకాశాలు వచ్చిన వెళ్లలేదు. బదిలీలు చేసిన ఇతర జిల్లాలకు వెళ్లి కొద్దిరోజులు పనిచేసి డిప్యుటేషన్‌పై తిరిగి వచ్చారు. తర్వాత రెగ్యూలర్ పోస్టింగ్‌లను తెచ్చుకున్నారు. కొంతమంది వివిధ కారణాలు చెప్పి బదిలీలను తప్పించుకున్నారు. మరికొంత మంది ఉద్యోగులు యూనియన్‌ల పేర్లు చెప్పి కూడా ఇతర జిల్లాలకు బదిలీ కావడం లేదు. మున్సిపల్, రెవెన్యూ, వాణిజ్యం, రవాణా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, జెడ్పీ, పోలీస్‌తోపాటు వివిధ ఇంజనీరింగ్ శాఖల్లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు, అధికారులు దీర్ఘకాలికంగా జిల్లాలోనే కొనసాగుతున్నారు. కొంతమంది కిందిస్థాయి ఉద్యోగులు తమకు అనుకూలంగా ఉన్న మండలాల్లోనే ఎక్కువగా పనిచేస్తున్నారు.

పదోన్నతులు వదులుకుని..

ఉద్యోగులకు పదోన్నతులు వచ్చినా కొంతమంది వదులుకొని తాము ఉన్నచోటే ఉద్యోగిగానే కొనసాగుతున్నారు. అధికారి అయితే ఇతర జిల్లాలకు వెళ్లే అవకాశం ఉండటంతో కదలడం లేదు. జిల్లాలోని నిజామాబాద్ కార్పొరేషన్‌తోపాటు ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీ పరిధిలో పలువురు అధికారులు, ఉద్యోగులు ఏళ్లతరబడి ఒకేచోట పనిచేస్తున్నారు. టౌన్ ప్లానింగ్‌తోపాటు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నవారు ఎక్కువగా కదలడం లేదు. స్థానిక కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నేతలతో ఉన్న పరిచయాలతో ఇక్కడే పనిచేస్తున్నారు. వీరు నేతలకు మున్సిపల్ పాలకసభ్యులకు దగ్గరగా ఉండటంతో ఇతర జిల్లాలకు మున్సిపాలిటీలకు బదిలీ అయిన రిలీవ్ చేయడంలేదు. వారిని ఏదో పేరున ఇక్కడే కొనసాగిస్తున్నారు. డైరెక్టరేట్ పరిధిలో పైరవీలు చేసుకొని కొనసాగుతున్నారు. ఇదే రీతిలో ఇతర శాఖల్లోనూ కొనసాగుతోంది. తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను ఎన్నుకొని ఉద్యోగులు దీర్ఘకాలికంగా అక్కడే పనిచేస్తున్నారు. స్థానిక నేతలకు దగ్గరగా ఉండి కొనసాగుతున్నారు. జిల్లాలో ఇలాంటి ఉద్యోగులు అన్ని మండలాల పరిధిలో ఉన్నారు. రాజకీయ నేతలకు కూడా వీరిఅవసరం ఎక్కువగా ఉండటంతో కదలడం లేదు. ఏదో రీతిలో మేనేజ్ చేసుకుంటూ ఇక్కడే కొనసాగుతున్నారు.
తమ సర్వీసును పూర్తిచేసుకుంటున్నారు.

సీనియార్టీ జాబితా పనిలో అధికారులు

ప్రభుత్వం ప్రస్తుతం బదిలీలకు అవకాశం ఇవ్వడంతో అధికారులు సీనియార్టీ లిస్టును తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారి వివరాలన్నింటిని సేకరిస్తున్నారు. జిల్లాలో కిందిస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర మండలాలకు, ఇతర డివిజన్‌లకు కూడా బదిలీ చేయనున్నారు. సొంత మండలాల్లో పనిచేసేందుకు నిబంధనలు అనుకూలంగా లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వారిని బదిలీ చేయనున్నారు. బదిలీ తప్పనిసరి కావడంతో ఉద్యోగులు, అధికారులు కూడా పైరవీలకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులతోపాటు నేతలు, ఉన్నతాధికారులు, సంఘాల ద్వారా అనుకూల ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మరికొంతమంది తాము పనిచేస్తున్న వింగ్‌నుంచి వేరే వింగ్‌కు బదిలీ అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. మున్సిపాలిటీలోని ఒక డివిజన్ నుంచి మరొక డివిజన్‌కు, ఒక మున్సిపాలిటీ నుంచి జిల్లాలోని మరొక మున్సిపాలిటీకి బదిలీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని వెబ్‌ఆప్షన్స్ ద్వారా బదిలీ ఆర్డర్లను ఇస్తుండటంతో అనుకూలమైన ఆప్షన్లే ఇచ్చేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో పైరవీలు జరగకపోవడంతో బదిలీ అయిన ప్రాంతాల్లో వెళ్లేందుకు అక్కడివారు రిలీవ్ కాకపోవడం వల్ల గందరగోళం ఏర్పడింది. ఉపాధ్యాయులు రిలీవ్‌అయి తాము బదిలీ అయిన పాఠశాలలకు వెళ్లగా అక్కడివారు కాకపోవడంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. కొంతమంది ఉపాధ్యాయులు ఇష్టం లేదని రిలీవ్ కాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు అన్నిశాఖల బదిలీలు వెబ్‌ఆప్షన్ ద్వారా చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎంతమంది బదిలీలు కానున్నారో, ఎంతమంది జిల్లాలో కొనసాగనున్నారో ఈనెల 20 తర్వాత తేలే అవకాశం ఉంది.



సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- వాటిని అరికట్టేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలి
- హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్

నిజామాబాద్ లీగల్, జూలై6: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటితో భవిష్యత్తు అంధకారంగా మారుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సుజోయ్‌పాల్ అన్నారు. నిజామాబాద్ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో శనివారం మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ప్రతీఒక్కరు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, లక్ష్యంవైపు అంకుఠిత దీక్షతో ముందుకు సాగాలని చెప్పారు. తాము చదువుకునే రోజుల్లో విద్యార్థుల ఆత్మహత్యలు లేవని, డ్రగ్స్ అనే పదమే వినిపించలేదని, నేడు కొంతమంది విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి మానసిక కుంగుబాటుకు లోనవుతూ బలవన్మరణాలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. జీవితంలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. విద్యార్థిదశ నుంచే క్రీడలు, వ్యాయామాలు చేస్తే మానసిక స్థైర్యం అలవడుతుందని అన్నారు. మన లోపాలను సరిదిద్దుకొని ముందుకెళ్లాలని సూచించారు. హైకోర్టు న్యాయమూర్తి పి.శ్రీసుధా మాట్లాడుతూ బాధ్యతలు తెలవని నేటితరం పిల్లలు చిన్నకారణాలకే మానసిక సమతుల్యం కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి వారే సులభంగా డ్రగ్స్ వైపు మొగ్గుచూపుతూ బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. అనంతరం డ్రగ్స్ వినియోగం వాటితో కలిగే కేసులు, శిక్షలు తదితర అంశాలపై నార్కటిక్ కంట్రోల్ బ్యూరోహైదరాబాద్ జోనల్ డైరెక్టర్ సచిన్ గోడ్పడే పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు. జిల్లాలో న్యాయసేవాధికార సంస్థ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల వివరించారు. సమావేశంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి పంచాక్షరి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తోపాటు అధికారులు, న్యాయవాదులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

మెండోరా రూరల్, జూలై6: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 1736 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1061 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 11.545 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో జూన్ ఆరంభం నుంచి ఇప్పటివరకు 5.480 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలు తగినంతగా పడకపోవడంతో ప్రాజెక్టులోకి భారీ వరదలు ఇప్పటివరకు నమోదు కాలేదు. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తిన మహారాష్ట్రలో వర్షాలు పడకపోవడంతో వరదరావడం లేదు. గత సంవత్సరం ఇదే సమయానికి ప్రాజెక్టులో 1065.20 అడుగుల నీళ్లు ఉండగా 16.405 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్

సీజనల్ వ్యాధుల నివారణకు
ముందస్తు చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వి కర్ణన్

నిజామాబాద్ అర్బన్, జూలై6: సీజనల్ వ్యాధులను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం వైద్యఆరోగ్యశాఖతోపాటు పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి ఆయన సమీక్షించారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ, విషజ్వరాల పరిస్థితి గురించి ఆరాతీశారు. గడిచిన మూడేళ్లలో జిల్లాలో ఎలాంటి మలేరియా కేసులు నమోదు కాలేదని అయితే పట్టణ ప్రాంతాల్లో ఒకింతవేగంగా విస్తరిస్తున్న డెంగ్యూ వ్యాధిని నియంత్రించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖతోపాటు మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖలు కూడా పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సీజనల్ వ్యాధుల నివారణకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ముఖ్యంగా సీజనల్‌వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను క్రమంతప్పకుండా నిర్వహించాలని, నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ మాల్స్ వేయాలని, గంబూషియా చేపపిల్లలను వదలాలని, పిచికారి మందు వేయించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని వ్యాధుల పరిస్థితిపై రోజువారి నివేదికలు సమర్పించాలన్నారు. డెంగ్యూ కేసునమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, అన్ని ఇళ్లు, సంస్థల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పారవేసి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిపాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులవ్యాప్తి చెందకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్, మహిళాశిశుసంక్షేమం, తదితర శాఖలు వైద్యఆరోగ్యశాఖతో సమన్వయం ఏర్పర్చుకొని డెంగ్యూ, విషజ్వరాలు ప్రబలకుండా ప్రణాళికబద్ధంగా పనిచేయాలన్నారు. సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు అమర్‌సింగ్, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డిపివో తరుణ్‌కుమార్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్‌లు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

• జీజీహెచ్‌ను తనిఖీ చేసిన కమిషనర్

పెద్దబజార్: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి కావాల్సిన సౌకర్యాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు.



- చేపూర్‌లో నర్సరీలో పెరుగుతున్న ఆయిల్ పామ్ మొక్కలు

ఆయిల్‌పామ్‌పై ఆసక్తి

- జిల్లాలో పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు
- జిల్లావ్యాప్తంగా సాగు చేస్తున్న రైతులు
- నాలుగేళ్లలో చేతికి రానున్న ఆయిల్‌పామ్ పంట
- పంట వేసే రైతులకు సబ్సిడీ కింద నిధులిస్తున్న ప్రభుత్వం

నిజామాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రభుత్వం ఈ పంట సాగు కోసం మొక్కలతో పాటు సబ్సిడీని ఇస్తుండటంతో రైతులు ముందుకు వస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ పంట సాగును పెంచేందుకు నిర్ణయించడంతో జిల్లాలవారీగా లక్ష్యాలను నిర్ణయించి సాగును పెంచుతున్నారు. ప్రైవేటు నర్సరీల ద్వారా మొక్కలను సరఫరా చేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు డ్రిప్‌కు సబ్సిడీ ఇవ్వడంతోపాటు నాలుగేళ్లపాటు మొక్కలను పెంచేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. పంటచేతికి వచ్చే సమయానికి కావాల్సిన ఫ్యాక్టరీ నిర్మాణం కూడా జరిగే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత పంట చేతికి రానుండటంతో రైతులు ముందస్తుగా ఈ పంటను వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆయిల్‌పామ్‌కు డిమాండ్ ఉండటం, విదేశాలకు కూడా ఎగుమతి అయ్యే అవకాశం ఉండటంతో ఇతర పంటలకంటే లేబర్ కూడా అవసరం లేకపోవడంతో కొంతమంది రైతులు ప్రయోగాత్మకంగా తమకున్న భూమిలో కొంతమేరకు ఈ సాగుచేస్తున్నారు. మొదటిపంట చేతికి వచ్చిన తర్వాత వచ్చే ఆదాయాన్ని బట్టి ఎక్కువ మంది రైతులు సాగు చేసే అవకాశం ఉన్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించడంతో పాటు పంటలు వేసే విధంగా ప్రోత్సహిస్తున్నారు.



జిల్లాలో 4500 ఎకరాల్లో సాగు

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు రెండేళ్ల క్రితం మొదలుపెట్టారు. గతసంవత్సరం జిల్లాలో 4500 ఎకరాల్లో సాగుచేయాలని నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కొంతమంది రైతులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తీసుకువెళ్లి అశ్వరావుపేటతోపాటు ఇతర మండలాల్లో ఉన్న పంటలను చూపించారు. అక్కడ ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులతో వీరికి అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగు వల్ల లేబర్ తగ్గడంతో పాటు ఇతర అంతర పంటలు కూడా సాగు చేసే అవకాశం ఉండటంతో ఎక్కువ మొత్తంలో రైతులు ఈ పంట వేసే విధంగా అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గత సంవత్సరం లక్ష్యం 4500 ఎకరాల వరకు నిర్ణయించిన జిల్లాలో 2023 ఎకరాల్లో పంట వేసేందుకు రైతులు ముందుకు వచ్చారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఎక్కువ మొత్తంగా సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపారు. దీనిలో రైతులు 1406 ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంటకు సంబంధించి 591 మంది రైతులు ఈ పంటను వేశారు. ఆయిల్‌ఫామ్ సాగు కొత్తవి కావడంతో ఆర్మూర్ మండలం చేపూర్‌లో ప్లాంటేషన్ ఏర్పాటుచేశారు. ఈ ప్లాంటేషన్ ద్వారానే రైతులకు మొక్కలను సరఫరా చేస్తున్నారు. ప్రతీ ఎకరాకు 50 నుంచి 53 మొక్కల వరకు పెడుతున్నారు. ఈ ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం కూడా సబ్సిడీని 50వేల వరకు ఇస్తోంది. ఎకరాకు 50వేలు ఇస్తుండగా దీనిలో 20వేల వరకు డ్రిప్ కోసం వినియోగిస్తున్నారు. మిగతా డబ్బులను నాలుగేళ్లపాటు ఆయిల్‌పామ్‌కు సాగుకోసం వెచ్చించనున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులతోపాటు ఇతర రైతులకు కూడా సబ్సిడీని నిబంధనల ప్రకారం అందిస్తున్నారు. ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా 2వేల ఎకరాల్లో ఈ పంట వేసే విధంగా ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు. ఈ సంవత్సరం మొత్తం ఇప్పటి వరకు 1350 ఎకరాలకు పరిపాలన అనుమతులను మంజూరు చేశారు. వీటితోపాటు డ్రిప్‌కు, ఇతర మెయింటేనెన్స్‌కు సబ్సిడీ ఇచ్చేందుకు నిర్ణయించారు. జిల్లాలో ఇప్పటివరకు 1230 ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేశారు.

20 ఏళ్ల పాటు కాత

ఆయిల్‌పామ్ సాగు నాలుగేళ్ల వరకు కొనసాగుతోంది. ఐదో సంవత్సరం నుంచి కాత ప్రారంభమవుతుందని రైతులు చెప్తున్నారు. కొన్నిసార్లు నాల్గో సంవత్సరంలో వచ్చినా తక్కువ మొత్తంలో ఉంటుందైదో సంవత్సరం నుంచి దాదాపు 20ఏళ్ల పాటు కాత ఉంటుంది. ప్రతీ సంవత్సరం ఈ పంటకోసే సమయంలోనే లేబర్ అవసరం ఉంటుంది. మిగతా సమయంలో పెద్దగా అవసరం ఉండదు. ఈ పంట కోసం పోచంపాడ్ వద్ద ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రైవేటు కంపెనీ చేపట్టింది. పంట చేతికొచ్చేవరకు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పూర్తిచేయనుంది. పంట చేతికొచ్చే సమయంలో కోసిన వెంటనే 24 గంటల్లో ఫ్యాక్టరీకి తరలించాల్సి ఉండటంతో ఆలోపే నిర్మాణం పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలను చేపట్టింది. పంట చేతికొచ్చిన తర్వాత ఇతర పంటలలాగానే రైతుకు ఆదాయం రానుంది. పెట్టుబడి తక్కువగా ఉండి లాభం కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

ఆయిల్ పామ్ సాగుకు చర్యలు

- మదన్‌మోహన్, ఉద్యానవన శాఖ జిల్లాధికారి

ఆయిల్‌కు డిమాండ్ ఎక్కువ ఉంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు చర్యలు చేపట్టాం. జిల్లాలో లక్ష్యాలకు అనుగుణంగా ఆయిల్‌పామ్ సాగయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రైతులకు అవసరమైన ఆయిల్‌పామ్ మొక్కలను నర్సరీల ద్వారా అందిస్తున్నాం.



పట్టణ పరిశుభ్రతకు చర్యలు

● మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్,జూలై 6 : కామారెడ్డి పట్టణ పరిశుభ్రత కోసం మాస్ క్లీనింగ్ చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ తెలిపారు. శనివారం 49 వ వార్డులో చేపడుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 మంది కార్మికులతో రోడ్లను, మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. పట్టణ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మోహర్‌షేర్, అన్వర్ అహ్మద్, పాత శివకృష్ణమూర్తి,చాట్ల వంశీ,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సిద్దరామేశ్వరనగర్‌లో మొక్కలు నాటిన నాయకులు


మొక్కలు నాటుతున్న యువకులు

భిక్కనూరు, జూలై 06: భిక్కనూరు మండలంలోని సిద్దరామేశ్వర నగర్ గ్రామంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మా కా నామ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు శనివారం మొక్కలు నాటారు. మొక్కలు నాటి సోషల్‌మీడియాలో ఫొటోలను పెట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రధాని పిలుపు, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి సూచన మేరకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తుసాయి, బత్తు అరుణ్, నవీన్‌రెడ్డి, బత్తుల ఆదర్శ్, గందం చరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ముందు చెట్లు నాటి పెంచుకోవాలి

సదాశివనగర్, జూలై 6:ప్రతిఇంటి ముందు మంచి ఫలాలను అందించే మొక్కలు నాటుకుని పెంచి పోషించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చందర్ నాయక్ అన్నారు. మండలంలోని తిమ్మాజీవాడిలో వనమహోత్సవంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టినందున ప్రజలు పచ్చదనాన్ని పెంపొందించేందుకు తమ వంతు కృషిచేయాలని అనంతరం గ్రామ హరితవనాలను నర్సరీని పరిశీలించి ప్రజలకు ఇంటి అవసరాలకు ఉపయోగపడే మొక్కలను పంపిణీ చేశారు.



సామాజిక తనిఖీ.. ఉపాధి పనులపై ప్రజావేదిక

మోస్రా,జులై6: మండల కేంద్రంలోని రైతు వేదికలో సామాజిక తనిఖీ ఉపాధి పనులపై ప్రజా వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా మండలంలోని గ్రామ పంచాయతీలలో వీఓఏలు సామాజిక తనిఖీ చేసిన అనంతరం శనివారం నాటు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తనిఖీ చేసిన పూర్తి అంశాలపై ఫిర్యాదులు గురించి వీఓఏలు అధికారులకు వివరించారు. ఇందులో భాగంగా మోస్రా గ్రామ పంచాయతీలో జరిగిన అంశాలు గ్రామ పంచాయతీ కార్యదర్శి గత కొన్ని నెలలుగా రోజ్గర్ దివస్ యోజన రిజిష్టర్ పద్ధతి పాటించని పంచాయతీ కార్యదర్శి ఎప్పుడు కూడా సంతకం లేదు కార్యదర్శి ముద్రలేదని గుర్తించారు. మొత్తం 7రకాల రిజిష్టర్ మెంటనెన్స్ చేయాలి కాని 3రకాల రిజిష్టర్ మెంటనెన్స్ చేస్తున్నారని తెలిపారు. సామాజిక తనిఖీ జరుగుతుంది అని తెలియపర్చిన కావాలనే రాలేదు. వీఓఏ అధికారులకు తెలిపారు.

అదే విధంగా నాటిన మొక్కల విషయమై అన్ని రకాల సౌకర్యాలు ఉన్న చింతకుంట రోడ్డు వైపు నాటిన మొక్కలు ఏ విధంగా నష్టం చేశారని ప్రశ్నించారు. మొక్కలు చూడడానికి ఒక వ్యక్తిని కూడా ఏర్పాటు చేసిన నష్టం జరిగింది అని పూర్తి వివరాలు ఆధారంగా అధికారులకు తెలియపరిచారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ సాయాగౌడ్ మాట్లాడుతూ మండలం చిన్నది అన్ని రకాల వసతులు ఉన్నాయి. పని ఎందుకు చేయలేకపోతున్నారు ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ ముగ్గురు పెద్ద గ్రామాలు చూసుకుంటే మిగతా గ్రామాల్లో టీఏ చూసుకున్న పని పూర్తి అవుతుందని మరోసారి ఇలాంటివి జరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి నారాయణ, అంబుస్మెంట్ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ సాయిలు, ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీఓ రఫీ, ఏపీఓ సురేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు భూమేష్, ముతీబ్, కృష్ణ, మహేశ్వరి, టీఏ అంబర్‌సింగ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ


ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

నాగిరెడ్డిపేట, జూలై 6 : మండలంలోని గ్రామాలలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ అధికారులు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీతో పాటు మండలంలోని బెజ్జం చెరువు తండా గ్రామ పంచాయతీలో శని వారం ఇంటింటికి ఆరుమొక్కల చొప్పున పంచాయతీ కార్యదర్శులు కిష్ట య్య, అనిత పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీల ద్వారా పెంచిన వివిధ రకాల పండ్ల, పూలమొక్కలను ట్రాక్టర్ల ద్వారా తరలించి వాడవాడకు తిరుగుతూ ఇంటింటికి పంపిణీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా పంపిణీ చేసిన మొక్కలను ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో నాటుకోవాలని, నాటిన ప్రతిమొక్కను కాపాడుకోవాలని వారు కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు.

హెల్త్ సబ్‌సెంటర్, నర్సరీల పరిశీలన

నసురుల్లాబాద్, జూలై 6 : నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శనివారం మండల పరిషత్ అధికారి ఎంపీవో రాము పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ గ్రామంలో వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు సౌకర్యాల మేరకు హెల్త్ సెంటర్‌లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని స్థానిక వైద్య సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోనర్సరీలో మొక్కలు రక్షించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్థానిక సెక్రటరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ, స్థానిక వైద్య సిబ్బంది,అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు

ఎల్లారెడ్డి, జూలై 2 : ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు పశువైద్యాధికారి ఈశ్వర్‌రెడ్డి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు రవికుమార్, రమేష్, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక కౌన్సిలర్ బాలమణి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

'పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి'

కోటగిరి,జులై6: అనాథ ఆశ్రమంలో ఉన్న పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిస్ట్రిక్ చైల్డ్ వేల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సంపూర్ణ సూచించారు. కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో గుమ్మడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమాన్ని శనివారం సీడబ్ల్యూసీ బృందం పరిశీలించింది. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి యోగా క్షేమాలు తెలుసుకున్నారు. అన్ని రకాల వసతులు కల్పించాలని ఫౌండేషన్ సభ్యులకు సూచించారు. రుచి కరమైన భోజనంతో పాటు వారి ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు రవితేజ, గంగాధర్, చైతన్య కుమార్, రాజేంద్ర ప్రసాద్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుచిత్ర, శ్రీధర్ తదితరులున్నారు.

'కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి'

నవీపేట,జులై6: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రపాణి కోరారు. శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో కలిసి ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావుకు వినతిపత్రం సమర్పించారు. కోడిగుడ్లతో పాటు రాగి జావకు సంబంధించిన సరుకులను సైతం ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగామణి, మంజుల, సరస్వతి, నరేష్, శ్రీనివాస్, తదితరులున్నారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

కామారెడ్డిరూరల్,జూలై 6 :మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో మాదిగ రాజకీయ సమితి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళురర్పించారు.అణగారిన కుటుంబాలకు ఆశాజ్యోతి అని అన్నారు.





సీజనల్ వ్యాధులపై అవగాహన

రెంజల్,జులై6: రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని కిసాన్ తండా, నీలా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉజ్మా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల దోమల నివారణకు తగు జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి ఉచిత మందులను అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా హ్యాండ్ వాషింగ్ టెక్నిక్ గురించి విద్యార్థులకు ప్రదర్శించి చూపించారు. వర్షాకాలం కావడంతో నీరు కలుషితం అయ్యే అవకాశం ఎక్కువగా ఉండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విష జ్వరాలు, వ్యాధి లక్షణాలు, చికిత్స మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీరణ అధికారులు శ్రావణ్ కుమార్, కరిపె రవీందర్, ఆరోగ్య సిబ్బంది చిన్నయ్య, రామకృష్ణ, జానకి, రాణి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీకి సన్మానం

వర్ని,జులై6: జడ్పీ ఫ్లోర్ లీడర్ చందూర్ జడ్పీటీసీ అంబర్ సింగ్‌ను శనివారం వర్ని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. జడ్పీటీసీగా పదవీకాలం ముగియడంతో ఆయన స్వగృహంలో ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నేమాని రఘు, పీరాజి నాయక్, కృష్ణా రెడ్డి, చందా వినోద్, నిఖిల్, జీవన్ పాల్గొన్నారు.

'రెండు రాష్ట్రాల సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటు'

సుభాష్‌నగర్, జూలై 6: గత ప్రభుత్వం పది సంవత్సరాల పాటు పాలించి రెండు తెలుగు రాష్ట్రాల సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటని టిడిపి నిజామాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదా గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పది సంవత్సరాల పాటు తెలంగాణ ముఖ్యమంత్రి విభజన హామీలపై పట్టించుకోలేదన్నారు. గతంలో పనిచేసిన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమస్యలు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చలకు వస్తుంటే ముక్కు విరవడాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

రెంజల్,జులై6: వాహనదారులు సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే శాఖపరమైన చర్యలు చేపడతామని మోటార్ వెహికల్ ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో వాహనాలను తనిఖీ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌లు రోడ్లపైన పట్టీలు లేకుండా నడిపితే ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ రోడ్లను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలతో వాహనాలు నడపాలని సూచించారు.

బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

నవీపేట,జులై6: మండలంలోని నాడాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీ మాక్లూర్ మండలానికి బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు మురళీకి శనివారం పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువ, పూలమాలలతో సన్మానించారు. 12సంవత్సరాల పాటు ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించడం పట్ల గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లత, మాజీ ఎంపీటీసీ రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, పీఆర్టీయూ మండల అధ్యక్షులు హన్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మసూద్, తదితరులున్నారు.

వ్యాధులు ముసురే కాలం.. ముందు జాగ్రత్తలే మందు



కోటగిరిలో మురికి నీటితో నిండిఉన్న మురుగు కాలువ



కాలనీలో నిలిచిన మురుగు నీటి దృశ్యం



కొత్తపల్లిలో కుండిలో నీటిని పారబోస్తున్న దృశ్యం

కోటగిరి,జూలై6: వర్షాల కోసం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాసులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అప్పుడప్పుడు అక్కడక్కడ తప్ప పూర్తిస్థాయి వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు విత్తుకున్న రైతులు వరుణుడు కరుణ చూపాలని కోరుతున్నారు. పంటలకు జీవం పోసే వర్షాలకు, జనానికి వ్యాధుల ముప్పు కూడా పొంచిఉంది. ఇప్పటికే అడప దడప వర్షాలు కురుస్తుండగా జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఆసుపత్రులకు వచ్చే వారు ఒళ్లు నొప్పులు, జలుబు, గొంతు నొప్పి వంటి లక్షణాలతో వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. వర్షాలు ఇంకా పూర్తిగా ప్రారంభం కాక మునుపే పరిస్థితి ఇలా ఉంటే భారీ వర్షాలు కురిస్తే వ్యాధులు మరింత ముసురుకునే అవకాశం ఉంది. జిల్లాలో గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో పాలకవర్గాలు, అధికారులు పారిశుధ్యంపై దృష్టి పెట్టిన ఫలితం లేకుండా పోతోంది. గ్రామాలు, పట్టణాల్లో మురుగునీటి నిల్వలు పేరుకుపోతే చెత్తచెదారాలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యం విషయంలో వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో జాగ్రత్తగా వ్యవహరించకపోతే వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది.

● మూడింటితో ముప్పు

మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులతో వానకాలంలో ముప్పు పొంచిఉంది. సాధారణ జ్వరంతో పాటు వీటి బారిన పడే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వర్షం పడి ఏర్పడుతున్న మురికి కూపలు, చెత్త నిల్వతో అపరిశుభ్రత కారణంగా ఈవ్యాధులు దరి చేరే అవకాశం ఉంది. వర్షాకాలంలో దోమల ద్వారా డెంగీ వ్యాపిస్తుంది. తీవ్రమైన వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల తేలికపాటి జ్వరంతో మొదలై ఇబ్బందిని పెంచుతుంది. జ్వరం,తలనొప్పి, శరీర నొప్పులు, దద్దుర్లు, కీళ్ల నొప్పులు వస్తాయి. కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారుతాయి. చికెన్ గున్యా, మలేరియా కూడా దోమల వల్ల వస్తాయి.కండరాల నొప్పులు అధికంగా ఉంటాయి. వర్షాలు పడినప్పుడు అపరిశుభ్ర వాతావరణంలో నివసిస్తున్న వారికి ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఇవే కాకుండా నీరు కలుషితం అయితే అతిసారం,కలరా,పచ్చకామెర్ల వ్యాధులు దరిచేరే అవకాశం ఉంటుంది.

● ప్రజలకు వైద్యుల సూచనలు

- ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- దోమల వృద్ధికి కారణమయ్యేలా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- పూల కుండీలు, పాత టైర్‌లలో నీరునిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.
- ఇళ్లలోని డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన నీటిని వారానికి ఒకసారి పూర్తిగా తొలగించి శుభ్రం చేయాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కారం.
- ఆహారం వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలి.
- చల్లబడితే బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది.
- ఫ్రైలు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.
- బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి.
- సీజనల్ పండ్లు ఆహారంలో భాగంగా చేసుకోవాలి.
- కూరగాయలు, ఆకు కూరలు శుభ్రంగా కడిగిన తర్వాతే వంటకు ఉపయోగించాలి.
- భోజనం చేసే కన్న ముందు చేతులుశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం

కోటగిరి ఉమ్మడి మండలంలోని గ్రామాలలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు వారు తల్లిదండ్రులకు వివరించేలా సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఇప్పటికే గ్రామాలలో నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నారు. వర్షాకాలం దృష్ట్యా కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచనలు ఇస్తున్నాం.

-గోవర్ధన్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి, కోటగిరి

ప్రశాంతంగా డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు

డిచ్‌పల్లి,జూలై 6: తెలంగాణ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని వన్‌టైం చాన్స్ (సీబీసీఎస్) బీఏ, బీకాం, బీఎస్సీబీబీఏ, కోర్సులకు చెందిన 5,6,సెమిస్టర్ బ్యాక్ లగ్ పరీక్షలు 5వ రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి గిరిరాజ్ కళాశాల నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కే బాన్సువాడ డిగ్రీ కళాశాల, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఆర్మూర్ కేంద్రాల్లో జరిగిన పరీక్షకు ఉదయం 19మంది విద్యార్థులకు 19మంది హాజరయ్యారు.మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 24మంది విద్యార్థులకు గాను పూర్తి సాయిలో హాజరయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు.

'వన మహోత్సవం విజయవంతం చేయాలి'



మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి

కోటగిరి,జూలై6: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోధన్ డీఎల్‌పీవో, మండల ప్రత్యేక అధికారి సాయిబాబా పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని హంగర్గ, రాంపూర్,కోటగిరి గ్రామాలలో శనివారం ఆయన పర్యటించారు. హంగర్గ గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ప్రతి గ్రామంలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎంపీవో మారుతీ, ఏపీవో గంగారాం, తదితరులున్నారు.

ఎంఎంజీజేసీ నూతన భవనాన్ని నిర్మించాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోధన్‌రూరల్,జూలై6: బోధన్ పట్టణంలోని మధుమలాంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని నిర్మించాలని ఏబీవీపీ బోధన్ శాఖ ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదు సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పాత భవనంలో అరకొర సౌకర్యాలతో ప్రభుత్వ మధుమలాంచ జూనియర్ కళాశాల నడుస్తుందన్నారు. పూర్తిగా శిధిలావస్థ స్థితిలో ఉన్న ఈ కళాశాల వర్షం వస్తే కూలిపోయే స్థితిలో ఉందన్నారు. విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు లేవన్నారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సురేష్, అరవింద్, అవినాష్, తన్వీర్, చరణ్, వీజేసింగ్, పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి



నగరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దబజార్, జూలై 6: మాటతప్పితే పోరాటం తప్పదని న్యాయబద్ధంగా రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. శనివారం ధర్నాచౌక్ వద్ద అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని అందుకే పోరాట బాట పట్టాల్సి వచ్చిందన్నారు. అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్‌కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి జూలై 1 నుంచి ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క టీచర్లకు 2లక్షల రూపాయలు, హెల్పర్స్‌కు రూ.లక్ష రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని వాగ్దానం చేశారని ఇచ్చినమాట నిలబెట్టుకోకపోతే పోరాటం తప్పదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి స్వర్ణవాణి, రాజ్యలక్ష్మి, హేమావతి, ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆదర్శం సత్యనారాయణ పురం

● ఎమ్మెల్యే పోచారం కితాబు



ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

వర్ని,జూలై6: అభివృద్ధికి ఆదర్శంగా వర్ని మండల కేంద్రంలోని సత్యనారాయణ పురంను తీర్చిదిద్దారని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రశంసించారు.సత్యనారాయణ పురంకు చెందిన తాజా మాజీసర్పంచ్ భర్త నేమాని నాగమణి భర్త వీర్రాజు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా సత్యనారాయణ పురం గ్రామ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులతో సుందరంగా తీర్చిదిద్దడం ఆ గ్రామ ప్రజలు చేసుకున్న పుణ్య ఫలితమని కొనియాడారు. ఇన్నాళ్ల పార్టీలు వేరైనా ఇక నుంచి రానున్న ఐదేళ్లలో మరింతఅభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలేటిసురేష్, నరేడ్లబాలు, గోవర్ధన్, నాగేశ్వరరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి



మొక్కలు నాటుతున్న యెండల లక్ష్మినారాయణ

పెద్దబజార్, జూలై 6: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి గొప్ప జాతీయవాది అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మినారాయణ అన్నారు. శనివారం నగరంలోని శ్రీనగర్‌కాలనీ 45వ డివిజన్‌లో బూత్ నెంబర్ 53లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏక్ పేడ్ మాకే నామ్ అనే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి 123వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 5లక్షల మొక్కలు నాటారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు స్వామియాదవ్, యెండల సుధాకర్, శ్రీనివాస్‌శర్మ, నారాయణయాదవ్, నాగరాజు, ఆకుల శ్రీనివాస్, రాహుల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండల కేంద్రంలో బీజేపీ నాయకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్, మాజీఎంపీటీసీ మురళీగౌడ్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు బోగ దేవేందర్, సంగెం అనిల్, కర్నె లక్ష్మీనర్సయ్య, సుద్దాల రాముగౌడ్, మోహన్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి, అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, ఓబీసీమోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్, రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, ద్యాగ ఉదయ్, గుర్రం విజయానంద్, కృష్ణగౌడ్, మీసాల రాజేశ్వర్, పొల్కం వేణు, పుప్పాల గిరి, పులి యుగంధర్, కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: జాతీయవాది శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి సందర్భంగా సిరికొండ మండలంలో పలు గ్రామాల బిజెపి నాయకులు మొక్కలు నాటారు. గడ్కోల్‌లో ఓబిసి మోర్చ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి ఆధ్వర్యంలో, రామడుగులో జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ నాయకత్వంలో, సిరికొండలో బాబురావు గోపి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శంకర్, గంగారెడ్డి, అజయ్, గోపిపాల్గొన్నారు.

రుద్రూరు: జాతీయ వాది, మాజీ కేంద్ర మంత్రి, జన్‌సంఘ్‌పార్టీ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం బీజేపీ నాయకులు రుద్రూరు మండల కేంద్రంలోని కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా బీజేపీ శ్రేణులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ బీజేపీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, సాయినాథ్, రామ్‌రాజు, పార్వతి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ సహకార దినోత్సవ వేడుకలు



డిచ్‌పల్లిఖిల్లాలో సహకార జెండాను ఎగరవేస్తున్న చైర్మన్ రాంచందర్

ఏర్గట్ల, జూలై 6: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఏర్గట్ల తాళ్లరాంపూర్ సొసైటీల ఆవరణలో శనివారం సంఘం అధ్యక్షుడు పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, బర్మ చిన్న నర్సయ్యలు జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బద్దం హన్మండ్లు, కొలిప్యాక శ్రీనివాస్, సీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా డిచ్‌పల్లి సహకార సంఘంలో సహకార జెండాను విండోచైర్మన్ రాంచందర్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సహకార సంఘంలోని రైతులం దరు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సహకార సేవలు సద్వినియోగం చేసుకొని సంఘ బలోపేతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌గంగారాం,డైరెక్టర్ గంగారెడ్డి, సీఈవో సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్:ఆలూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ తంబురి శ్రీనివాస్ సహకార సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, సొసైటీ డైరెక్టర్‌లు కల్లెం సాయిరెడ్డి, బార్ల సంతోష్‌రెడ్డి, సింగిడి మల్లుబాయి, ఏఈవో వసుధాం, సొసైటీ కార్యదర్శి మల్లేష్, గంగాధర్, ముత్యం, దేవరాజ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సహకార వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం చైర్మన్‌బద్దంఅశోక్‌రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించారు. డైరెక్టర్‌లు, సొసైటీ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, నవీన్, డైరెక్టర్‌లు అశోక్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వర్ని:మండల పరిధిలోని పాత వర్ని, జాకోర, చందూర్ మండల కేంద్రాల్లో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవంను నిర్వహించారు. అధ్యక్షులు నామాల సాయిబాబా, దశరథ్, అశోక్ యాదవ్‌లు ఆయా విండోల పరిధిలో సహకార దినోత్సవ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో కార్యదర్శులు గంగాధర్, రామకృష్ణ, భూమయ్య, సభ్యులు గంగప్ప, గంగారాం, బబ్యా పాల్గొన్నారు.

మోపాల్: అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని బోర్గాం(పి), బాడ్సి, మోపాల్, మాధవనగర్ సొసైటీలలో చైర్మన్లు జెండాలను ఎగరవేశారు. అనంతరం అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా చైర్మన్లు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సొసైటీ పాలకవర్గంతో పాటు కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇందల్వాయి:వ్యవసాయ సహకార సంఘం వారోత్సవాల్లో భాగంగా శనివారం ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి జెండా ఎగరవేసి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సొసైటీ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందిస్తున్నామని సహకార అభివృద్ధి కోసం సంఘ సభ్యులంతా ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మారుతి, సొసైటీ డైరెక్టర్లు దాసు, మల్లారెడ్డి, సుధాకర్, గంగారాం, ముత్తెన్న, సొసైటీ సిఇవో రతన్, కిషన్, తదితరులు ఉన్నారు.

బోధన్‌రూరల్: సహకార సంఘాల ద్వారా రైతులతో పాటు అందరికి మెరుగైన భవిష్యత్ లభిస్తుందని సాలూర సహకార సంఘం అధ్యక్షుడు అల్లె జనార్ధన్ అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సాలూర సోసైటీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి కూటమి, యూనైటెడ్ నేషన్స్ కమిటీ ఫర్ ప్రమోషన్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కోఆపరేటివ్ కలిసి సంయుక్తంగా 1997వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సహకార సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరంలాగే ఈ యేడాది జులై మొదటి శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన భవిష్యత్ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సోసైటీ సీఈవో బస్వంత్ రావు, సోసైటీ డైరెక్టర్‌లు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి మరమ్మతులు చేయించిన ఎన్ఆర్ఐ బృందం



మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ ఫౌండర్ అధ్యక్షుడు

మాక్లూర్, జూలై6: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఎన్ఆర్ఐ బృందం పాఠశాలల రూ.3లక్షలపైగా నిధులతో మరమ్మతులు చేయించారు. బెస్ట్ రయన్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఇట్టి నిధులను అందించామని ఫౌండర్ అధ్య క్షుడు పొల్లెటి సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రమ శిక్షణతో మెదులుతూ చదువులలో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించిన ప్పుడు తాము పుట్టిపెరిగిన గ్రామంతో పాటు చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేయా ల ని ఆయన కోరారు. ఈకార్య క్రమం లో పాఠశాల ప్రత్యేక అధికారి ప్రగతి,ఉపా ధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

9న టీయూలో జాబ్ మేళా

డిచ్‌పల్లి,జులై 6: తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9న తెలంగాణ విశ్వవిద్యాలయం, తెలం గాణ ఆకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థ సం యుక్తంగా డీఎస్ టెక్నాలజీస్ కంపనీలో టెక్నికల్ రిక్రుటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎక్స్‌క్యుటివ్ మార్కెటింగ్ ఖాళీల భర్తీకి డీఎస్ టెక్నాలజీస్ వారిచే ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నమని ఈ మేళా లలో ఉద్యోగ ఔత్సాహికులకు, వ్యక్తిగత పరిచయ రౌండ్, గ్రూప్ డిస్కర్షన్, ఎఫ్‌టూ ఎఫ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నమని ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా.పాత నాగరాజు తెలిపారు. పీజీఫైనాల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ప్లేస్‌మెంట్ సెల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని డైరెక్టర్ పేర్కొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం

● పాఠశాలకు రూ.లక్ష 50వేల విరాళం ప్రకటించిన మాజీసర్పంచ్



విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఆర్మూర్‌రూరల్, జూలై6 ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను శనివారం ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన పదో తరగతి ఫలితాల్లో ఆలూర్ పాఠశాల నుంచి 11మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బాసర ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులతో పాటు హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులను గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌గడ్డం సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి రూ. లక్ష 50వేలు అందజేస్తానని ప్రకటించారు. అదే విధంగా 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు వచ్చే నెలలో ప్రోత్సాహకాన్ని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్‌లు కల్లెం మోహన్‌రెడ్డి, గడ్డం సంతోష్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీమల్లేష్, వీడీసీసభ్యులు, అన్నపూర్ణ ట్రస్ట్ ఆర్మూర్ అధ్యక్షుడు రాజన్న, మాజీ ఉపసర్పంచ్ దుమ్మజీ శ్రీనివాస్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అశ్వక్‌షైమద్, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండలం రామన్నపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన నలుగురు విద్యార్థినిలను శని వారం ఘనంగా సన్మానించారు. ట్రిబుల్ ఐటిలో సీటు సాధించిన విద్యార్థినిలు గడ్డం నిఖిక, గడ్డం శ్రీజ, కుంబాజి రచన, ఇందూర్ శ్వేతలను విశ్రాంతి ఉపాధ్యాయులు రామోజీ మురహరి, కొమ్మల గంగాధర్‌లు నగదు, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.శివాజీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీయూ ఎంఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి,జులై 6: తెలంగాణ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల ఎంఏడ్ 1వ సెమిస్టర్, పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు ఉదయం జరిగిన పరీక్షకు 35మంది విద్యార్థులకు గాను 29మంది హాజరయ్యారు. 6గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల నిజామాబాద్ కేంద్రంలో జరుగుతున్నయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు.

విద్యుత్ డీఈపై విచారణ

ఆర్మూర్‌టౌన్, జూలై6: పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ డీఈ హరిచంద్‌పై శనివారం ఏపీటీఎస్ అధికారులు విచారణ చేపట్టారు. డివిజన్‌లోని పలు పనుల విషయంలో డీఈకి సన్నిహితంగా ఉండే ఉద్యోగులకు ముడుపులు అందించాల్సి వస్తోందని కాంట్రాక్టర్‌లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో ఏపీటీఎస్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండవ రోజు విచారణ చేపట్టినట్టు తెలిసింది.

ప్రజాపాలన కాదు.. అప్రజాస్వామ్య పాలన

ఏర్గట్ల,జూలై 6: కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన కాదు..ఇది ముమ్మాటికి అప్రజాస్వాయ్య పాలనేనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగి, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణా నందం, కొలి ప్యాక ఉపేందర్ రెడ్డి, సామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బద్ధం శ్రీనివాస్, నాగిరెడ్డి రాజేందర్, ఎండి అశ్రఫ్, సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, రొక్కిడమో హన్, బద్ధంప్రభాకర్,గద్దెగంగారాం, కట్కం సాగర్‌లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఖిల్లా, జూలై 6: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరుగగా శనివారం ఉదయం వెలుగులోకి వచ్చినట్లు ఆరవ టౌన్ ఎస్సై మొగులయ్య తెలిపారు. అర్సపల్లికి చెందిన నవీన్‌కుమార్ (44) ప్రతిరోజు సాయంత్రం తాను నడిపే కిరాణ షాపు కోసం సామన్లు తీసుకొని వచ్చేవాడని ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి సామాన్లు తీసుకొని వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మృతుడు సమీపంలో ఉన్న మురికి కాలువలో పడి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా వాహనాన్ని గుర్తిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతీ ఇంటిలో ఐదు మొక్కలను నాటాలి

భీమ్‌గల్ రూరల్, జూలై 06: చెట్లువుంటేనే జీవనానికి మనుగడ అని, ప్రతి ఒక్క వ్యక్తి ఐదేసి మొక్కలను నాటాలని ఎంపిడిఓ సంతోష్ కుమార్ అన్నారు. హరితవణం కార్యక్రమంలో భాగంగా శనివారం భీమ్‌గల్ మండలంలోని పురాణిపేట్, బడాభీమ్‌గల్, కుప్కల్, పల్లికొండ, పిప్రి, బాచన్‌పల్లి తదితర గ్రామాలలో హరితహారం మొక్కలను అందజేశారు. గ్రామాలలో మహిళాసంఘం సభ్యులకు ఇంటిఆవరణలో మొక్కలు నాటడానికి మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపివో తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బోధన్‌రూరల్,జులై6: సాలూర మండల కేంద్రానికి చెందిన నీలకంఠం లక్ష్మవ్వ(75)అనే మహిళ నిజామాబాద్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాలూర మండల కేంద్రానికి చెందిన నీలకంఠం లక్ష్మవ్వ జూన్ నెల 28వ తేదిన తన కూతురు గ్రామామైన హున్సకు వెళ్లిందన్నారు. అక్కడ స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు వేడినీరు పడడంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రానికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు శవ పంచానామా నిర్వహించి విచారణ చేపడుతున్నామన్నారు.

వాహనాలను అతివేగంగా నడపొద్దు

బోధన్‌రూరల్,జులై6: ద్విచక్ర, కార్లు నడిపే వారు తమ వాహనాలను అతివేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని, వాహనాలు అజాగ్రత్తగా నడిపినా, ఎవరినైనా ఢీకొట్టిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో గుర్తు తెలియని వాహనం మహిళను ఢీకొని వెళ్లగా విచారణ జరిపి వాహనాన్ని గుర్తించామని ప్రమాదానికి కారణమైన వారిపై కేసు నమోదు చేశామన్నారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులు కావద్దని హెచ్చరించారు.

రేపు జక్రాన్‌పల్లిలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి, జూలై6: మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లిలో ఈనెల 8న కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జక్రాన్‌పల్లిలోని అరుంధతి ఫంక్షన్ హాల్‌లో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యేభూపతిరెడ్డి లబ్ధిదారు లకు కల్యాణ లక్ష్మీ,షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ

ధర్పల్లి, జూలై 6:ధర్పల్లి మండలం ఆదర్శ పాఠశాల బాలికల కోసం ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్సలో శిక్షణ ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రధానమంత్రి పథకం కింద ఆదర్శ పాఠశాల ఎంపిక కావడంతో అందులో భాగంగా పాఠశాలలో చదివే బాలికలందరికి ఆత్మరక్షణగా నైపుణ్యంగా మార్షల్ ఆర్ట్సలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మాస్టర్ వినోద్‌నాయక్ వారంలో రెండు రోజులు కైక్వాండో శిక్షణ ఇస్తారని అన్నారు.

సాగునీరును అందించాలని వినతి

నిజామాబాద్ అర్బన్, జూలై 6: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై చాలా రోజులు అవుతున్న వర్షాలు కురవక రైతులు వేసినటువంటి వరినాట్లు ఎండిపోతున్నాయని కొన్నిచోట్ల వరినాట్లు వేద్దామన్న సాగునీరు అందడం లేదని కావున నిజాంసాగర్ కెనాల్ ద్వారా అలిసాగర్ దిగువ ఉన్న ప్రాంతానికి సాగునీరు అందించాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

న్యాయమూర్తికి వినతిపత్రం అందజేసిన బార్ సభ్యులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ సభ్యులు

నిజామాబాద్ లీగల్, జూలై 6:జిల్లా న్యాయసేవా అధికారసంస్థ ఆధ్వర్యంలో శనివారంనిర్వహిస్తున్న సెమినార్‌లో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్‌జడ్జి పి.శ్రీసుధను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా కోర్టు సమస్యల గురించి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా కోర్టులో కేసులు పెరగడంతో వాహనాల రద్దీ ఎక్కువ అవడంతో పా ర్కింగ్ చాలా ఇబ్బందికరంగా ఉంటుందని కోర్టు పరిధిలో ఉన్న డిఇవో ఆఫీస్ ఖాళీ స్థలాన్ని కోర్టు పార్కింగ్ కోసం కేటాయించాలని కోరారు.జిల్లాకోర్టులో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక ఫోక్సో కోర్టు జడ్జిల కొరత ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పి.రాజు, కార్యదర్శి వసంత్‌రావు, బార్ సభ్యులు దీపక్, తదితరులు పాల్గొన్నారు.

● హైకోర్టు న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేత

అంతకుముందు ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌ను జిల్లా న్యాయవాదులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మాజీ మేయర్ సంజయ్‌కి సోనియాగాంధీ లేఖ

నిజామాబాద్ అర్బన్, జూలై 6: మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ మేరకు నగర మాజీ మేయర్, డీఎస్ తనయుడు సంజయ్‌కి సంతాప లేఖను పంపారు. డీఎస్ ఎంతో నిబద్ధతతో కలిగిన నాయకుడని ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని సోనియాగాంధీ తన లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా, యువజన కాంగ్రెస్ ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా డీఎస్ ప్రజలకు ఎంతో సేవ చేశారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి డీఎస్ చేసిన సేవలను ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. ఆయన రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలని సంజయ్‌ని కోరారు. తన తండ్రి మృతిపట్ల లేఖరాసిన సోనియాగాంధీకి సంజయ్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ఒకే విధమైన పౌర స్మృతి ఉండాలి

పెద్దబజార్, జూలై 6: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశం మొత్తానికి హిందువులకు, ముస్లింలకు ఒకే విధమైన పౌర స్మృతి ఉండాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. శనివారం నగరంలోని బిజెపి కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్నవయస్సు 33 సంవత్సరాల్లోనే కలకత్తా విశ్వవిద్యాలయంలో కులపతిగా, హిందు మహాసభ అధ్యక్షుడిగా పనిచేయడం జరిగిందన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రయత్నం వల్ల కాశ్మీర్‌కు వెళ్లాలంటే గుర్తింపుకార్డు నియామకం తొలగించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు న్యాలంరాజు, లక్ష్మీనారాయణ, నారాయణయాదవ్, కిశోర్, స్వామియాదవ్, సుక్కమధు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ అధికారుల తనిఖీలు

● నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో హోటళ్లకు జరిమానాలు


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్,జూలై6: నగర పాలకసంస్థ అధికారులు రెండో రోజు తనిఖీలు నిర్వహించారు. నగర పాలక సంస్థ, రెవెన్యూ విభాగం, సానిటేషన్ విభాగంలో తనిఖీలు నిర్వహించారు. నగర పాలక సంస్థ కమీషనర్ మందమకరంద్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమీషనర్ రాజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని ప్రముఖ హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ట్రేడ్ లైసెన్సుకు అనుగుణంగా లేనివాటిని గుర్తించి వాటికి జరిమానాలు విధించారు. నగరంలోని ప్రముఖ హోటల్ నిఖిల్ సాయిలో ఫ్రిడ్జిలో ఉంచిన మాంసారాన్ని వినియోగిస్తున్నారని గుర్తించి వారికి 15వేలు జరిమానా విధించారు. అంతేకాకుండా బిర్యాని దర్బార్‌లో సైతం తనిఖీలు నిర్వహించి జరిమానా విధించారు. దాని పక్కన ఉన్న హాట్‌చిప్స్‌లో ప్లాస్టిక్ కవర్లలో అమ్ముతున్నారని గుర్తించి 3వేల జరిమానా విధించారు. తనిఖీలు ప్రతిరోజు కొనసాగుతాయని దుకాణాదారులు, యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటించి శుభ్రమైన ఆహారాన్ని వినియోగదారులకు అందజేయాలని డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి నరేందర్, సానిటరి ఇన్స్‌పెక్టర్‌లు నటరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ గుట్టల్లో చిరుత పులి సంచారం

● భయం గుప్పిట్లో సమీప గ్రామాల ప్రజలు


కమలాపూర్‌లో మేకల మందపై చిరుతపులి దాడి చేసిన గుట్ట ప్రదేశం

నవీపేట,జులై6: మండలంలోని కమలాపూర్ శివారులో చిరుత సంచారంపై సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం కమలాపూర్ శివారులో మేకల మందపై చిరుత పులి దాడి చేసిన విషయం విదితమే. చిరుత సంచారంపై కమలాపూర్‌తో పాటు సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం సైతం అటవీశాఖ బీట్ ఆఫీసర్లు సుధీర్, విజయ భారతిలు సందర్శించారు. చిరుత సంచారంతో రాత్రిపూట కమలాపూర్, మోకన్‌పల్లి రోడ్డుపై ప్రయాణించడానికి ప్రజలు జంకుతున్నారు. పొలాలకు వెళ్లడానికి రైతులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే చిరుతను బంధించడానికి బోను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం : బోధన్ ఎమ్మెల్యే

● జిల్లాలో ధరణి సమస్యలు దాదాపు పూర్తి


మాట్లాడుతున్న మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూలై 6: రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేరుకుపోయిన ధరణి అప్లికేషన్లను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం నిజామాబాద్‌లోని తననివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 52 వేలకు పైగా ధరణి అప్లికేషన్‌లు ఉంటే ఇప్పటికే చాలా వరకు పరిష్కరించడం జరిగిందని మిగిలిన వాటిని కూడా పరిష్కరించాలని కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్‌డివోలను ఆదేశించడం జరిగిందన్నారు. కలెక్టర్‌తో ధరణి అప్లికేషన్ల విషయమై సమీక్షించడం జరిగిందని రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని మరికొన్ని రోజుల్లోనే జిల్లాలోని అన్ని ధరణి దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు. ధరణి వల్ల రైతులు తమ భూములు అమ్ముకోవడానికి, ఇతర అవసరాలకు వినియోగించుకోవడానికి అదేవిధంగా రైతుబంధు డబ్బులు సైతం అందడం లేదని వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడికక్కడ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. తహసీల్దార్, ఆర్‌డివో స్థాయిలో మిగిలినవి అదనపు కలెక్టర్, కలెక్టర్ల స్థాయిలో పరిష్కారం అవుతున్నాయని అన్నారు. జిల్లాలో అధికారులు అద్భుతంగా సమస్యలను పరిష్కరిస్తున్నారని కొంత మేర అప్లికేషన్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 846 అప్లికేషన్‌లు పాతవి, ఆర్‌డివో వద్ద 1092, అదనపు కలెక్టర్ వద్ద 1100 మొత్తం 2వేలకు పైగా అప్లికేషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని బోధన్ డివిజన్ పరిధిలో 976, ఆర్మూర్ డివిజన్ పరిధిలో 1400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని సైతం తొందరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులకు పోస్టు ద్వారా పాస్‌బుక్కులు ఇంటికి వస్తాయని రాష్ట్రంలోనే జిల్లా ధరణి సమస్యలు పరిష్కరించడంలో మొదటి స్థానంలో ఉందన్నారు. సర్వేయర్లు సక్రమంగా చూసి ఎవరి భూమిని వారికి పట్టా వచ్చే విధంగా చూడాలని ప్రభుత్వం సైతం రైతులను ఇబ్బంది పెట్టకుండా పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్‌ల పేరుతో కాంగ్రెస్ మోసం చేసింది

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

పెద్దబజార్, జూలై 6:ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం డిక్లరేషన్‌ల పేరుతో యువతను మోసం చేసిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పేరుతో తెలంగాణ తొలి మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పి మోసం చేసిందన్నారు. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, గౌరవ పెన్షన్ ఇస్తామని మర్చిపోయారని అన్నారు. జాబ్‌క్యాలెండర్ ప్రకటించి సెప్టెంబర్ 17లోపు నియామకాలు చేపడుతామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. 2లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ ఊసేలేదని పేర్కొన్నారు. కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ పేరుతో కులగణన, బీసీ కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని విమర్శించారని మండిపడ్డారు. అలాగే రెండోదశా గొర్రెల పంపిణీ ఏమైందని ప్రశ్నించారు. మొదటి విడతలో జరిగిన కుంభకోణంలో కేసీఆర్‌ను కాపాడే ప్రయత్నం జరుగుతుందన్నారు.

● నగరంలో సమస్యలు

నగరంలో ఎన్నో సమస్యలు తలెత్తాయని వాటిని పరిష్కరించాలని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లను కోరానని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. ప్రధానంగా వినాయక్‌నగర్, ఎల్లమ్మగుట్టలో బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని కంఠేశ్వర్, గాజుల్‌పేట్, దేవిటాకీస్ సమీపంలో స్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. పాతకలెక్టరేట్ స్థలంలో క్రీడా స్టేడియం నిర్మించాలని, శంభుని గుడి చుట్టూ ఆక్రమించిన దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు న్యాలంరాజు, లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు సుధీర్, మాస్టర్ శంకర్, బద్దం కిషన్, అంబదాస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా బాబుజగ్జీవన్‌రాంకు ఘన నివాళి


బోధన్‌లో జగ్జీవన్ రాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై6: బాబు జగ్జీవన్ రాం సేవలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్ అన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రాం 41వ వర్ధంతి సందర్భంగా బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రాంకు దళిత సమాజం ఆయన సేవలను గుర్తించి రుణపడి ఉండాలని ఆయన పేర్కొన్నారు. దేశంలో అత్యధిక కాలం పాటు కెబినెట్ మినిస్టర్‌గా సేవలు అందించడం దళిత సమాజానికే చాలా గర్వకారణమన్నారు. దేశ చరిత్రలో ఓటమి ఎరుగని నాయకుడిగా సమాజానికి నిరంతరం సేవలందిస్తూ ఎనలేని కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మింగారి భూమయ్య, పానుగంటి సాయిలు, గంధమాల చంద్రయ్య, బండారి పోశెట్టి, లింబూరి లక్ష్మణ్, తాడెపు అబ్బయ్య, జేఏసీ శంకర్, జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మల్లారెడ్డి చెరువుకట్టపై దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బాబుజగ్జీవన్‌రాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబుజగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్పశ్రీనివాస్, భూమన్న, శ్రీనివాస్, ఫయ్యూం, ఆకుల రాము, ఎమ్మార్పీఎస్ నాయకులు మైలారం బాలు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రాం 38వ వర్ధంతిని దళితులు ఘన నివాళి అర్పించారు. శనివారం మోర్తాడ్ మండల కేంద్రంలో జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేసి వివిధ పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో దళిత సంఘాల పెద్దలు తోట గంగారాం, దండు చిన్న గంగారాం, తెడ్డు గురువయ్య, అరుణ్, చిన్నారెడ్డి, కె.గంగాధర్, సృజన్, సంజీవ్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీడీఎంఏ ఆదేశాల మేరకు బిల్ కలెక్టర్ల ఎంపిక

సుభాష్‌నగర్, జూలై 6: సీడీఎంఏ ఆదేశాల మేరకు నూతనంగా వచ్చిన వీఆర్‌వోలను బిల్ కలెక్టర్లుగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉన్న బిల్‌కలెక్టర్లు ఇతర శాఖల నుంచి తాత్కాలిక పద్ధతిలో బిల్ కలెక్టర్‌గా కొనసాగడంతో శాశ్వత ప్రాతిపదికన నూతనంగా వచ్చిన వార్డు బాయ్‌లను బిల్‌కలెక్టర్‌లుగా ఎంపిక చేశారు. నూతనంగా వచ్చిన బిల్‌కలెక్టర్లను లాటరీ పద్దతి ద్వారా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, రెవెన్యూ అధికారి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

జలాల్‌పూర్ బుకారి దర్గా ఉర్సు నూతన కమిటీ ఎన్నిక

బోధన్‌రూరల్,జూలై6: బోధన్ పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన హజరత్ సయ్యద్ జలాల్‌పూర్ బుకారి దర్గా ఉర్సు కమిటీని శనివారం దర్గా ముత్తావలి షేక్ ముక్త్యార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఖాజా షర్ఫోద్దీన్, ప్రధాన కార్యదర్శిగా యూనుస్ పటేల్, పరిరక్షకులుగా ముషీర్ బాబా, కోశాధికారిగా మహ్మద్ ముక్రీమ్ హైమద్, ఉపాధ్యక్షుడిగా సనాపటేల్, రహీంఖాన్, ఇబ్రహీంఖాన్, అబ్దుల్ రజాక్, కలీం,సోఫియన్,జాయింట్ సెక్రెటరీలుగా ఇబ్రహీం తీర్‌గల్లీ, ముస్తాక్ అహ్మద్, అబ్దుల్ జబ్బర్, లాయక్ అలీ, అబ్దుల్ హది,షహబాజ్ హుస్సేన్, ఇంతియాజ్ బేకరీ, ప్రధాన వాలంటీర్లుగా ఇమ్రాన్ హుస్సేన్,సభ్యులుగా పలువురునూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఇందల్వాయి, జూలై 6: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరారం రెవెన్యూ పరిధిలోగల లింగాపూర్ శివారులో సర్వే నంబర్ 180లో తమ భూమి కబ్జా చేస్తున్నారని అడ్డుకున్నందుకు గ్రామానికి చెందిన తులసమ్మ, భర్త గంగాధర్‌లపై దాడి చేసిన సంతోష్‌రెడ్డిపై కేసు నమోదైనట్లు ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

రుద్రూరులో సీజనల్ వ్యాధులపై అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి

రుద్రూరు,జూలై 6: రుద్రూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ టఎస్ (బాలికల) పాఠశాలలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అయేషా సిద్దిఖా, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి అయేషా సిద్దిఖా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, దోమలు పుట్టకుండా వాటి జీవిత చక్రమును నిర్వీర్యం చేయడానికి ప్రతి శుక్రవారంను డ్రై డేగా పాటించడం వల్ల దోమలు వృద్ధి చెందవన్నారు. మలవిసర్జన తరువాత, ఆహారం తీసుకునే ముందు తప్పక చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో రాజేందర్, సూపర్‌వైజర్లు ఆర్.రవి, సుమతి, జడ్పీహెచ్ఎస్ (బాలికల) పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయురాలు ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు విద్యార్థినిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి దుర్మరణం



మృతుడి నాగేశ్వరరావు (ఫైల్)

డిచ్‌పల్లి,జులై 6:గత నెల 24న బైకుపై నిజామాబాద్ నుంచి ధర్మారం(బి)కి వస్తున్న టీడీపీ నాయకుడు గొనుగంటి నాగేశ్వరరావు (60) ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి 12రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందు తూ శనివారం మృతి చెందాడు. అందరితో కలిసి మెలిసి ఉండే నాగేశ్వరరావు మృతి విషయం తెలుసుకొని హైదరాబాద్ నుంచి మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు హుటాహుటిన ధర్మారం వచ్చి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చరు. మండవ వెంట పార్టీ ప్రతినిధులు రావుల బ్రహ్మానందం, నాయుడు ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

ఆధార్ సెంటర్‌లో ల్యాప్‌టాప్ చోరీ

ఇందల్వాయి, జూలై 6:ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ భవనంలోని పై అంతస్తులో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రంలో చోరీ జరిగింది. ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ భవనంలోనిపై అంతస్తులో నడుస్తున్న ఆధార్ నమోదు కేంద్రంలో గుర్తుతెలియని దుండగులు గది తాళాన్ని ధ్వంసం చేసి ల్యాప్‌టాప్‌ను అపహరించుకుపోయారని అన్నారు. ఆధార్ కేంద్రంలో ఇతర సామాగ్రిని అలాగే ఉంచి కేవలం ల్యాప్‌టాప్ మాత్రమే ఎత్తుకెళ్లారని ఆధార్ కేంద్రం నిర్వహకుడు గోపాల్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కందకుర్తిలో ఒకరి అదృశ్యం


ఫిరోజ్‌ఖాన్ (ఫైల్)

రెంజల్,జూలై6: మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన ఫిరోజ్ ఖాన్ అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కందకుర్తి గ్రామానికి చెందిన ఫిరోజ్ ఖాన్ అనే వ్యక్తి గత నెల 16వ తేదిన ఇంటి నుంచి మేస్త్రీ పని చేయుటకు వెళ్లాడని సాయంత్రం ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలలో బంధువుల వద్ద వెతుకగా ఆచూకీ లభించకపోవడంతో ఫిరోజ్ ఖాన్ భార్య పర్హానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. వ్యక్తి ఆచూకీ లభ్యం అయితే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

ఆగస్టు 4న టీటీసీ థియరీ పరీక్ష

నిజామాబాద్ అర్బన్,జూలై6:టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (లోయర్ గ్రేడ్) థియరి పరీక్ష ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి, గతంలో ఫెయిల్ అయిన అభ్యర్థులకు ఆగస్టు 4న థియరి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 1గంట వరకు ఎడ్యుకేషనల్ సైకలాజీ మరియుస్కూల్ అడ్మినిస్ట్రేషన్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 3గంటల వరకు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (జనరల్), మధ్యాహ్నం 3.30నుంచి4.30వరకు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (స్పెషల్) పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ప్రారంభమైన ఎప్‌సెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, జూలై 6:ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశానికి టిజిఎప్‌సెట్-2024 మొదటి విడత కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమైంది. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల కౌన్సెలింగ్ కేంద్రంలో మొదటిరోజు 535 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు జిల్లా సమన్వయ కర్త శ్రీరాంకుమార్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 13 వరకు కొనసాగుతుందని వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు ఈనెల 8 నుంచి 15తేదీలోగా వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

కొత్త బస్సులు మంజూరు చేయాలని వినతి


మంత్రి కలిసిన వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్,జూలై6ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో బస్సుల కొరతఉందని, కొత్త బస్సులను కేటాయించాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి శనివారం రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు విన్నవించారు. హైదరాబాద్‌లో మం త్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వ కలిసిన వినయ్‌రెడ్డి రవాణాకు సంబంధించి పలు అంశాలను మం త్రికి దృష్టికి తీసుకు వెళ్లారు.అదేవిధంగా పట్టణంలోని ప్రసిద్ధ నవ నాథ సిద్దులగుట్టపై ప్రతీసోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉం టుందని, భక్తుల సౌక ర్యార్థం ఒక బస్సును ఏర్పాటు చేయాలని కోరారు.సానుకూలంగా స్పందిం చిన మంత్రి త్వరలోనే కొత్త బస్సు లను మంజూరు చేస్తా నని హామీ ఇచ్చినట్టు వినయ్‌రెడ్డి తెలిపారు.

మూడు మడిగెలు సీజ్

ఆర్మూర్‌టౌన్, జూలై6: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో శనివారం మూడు మడిగెలను సీజ్ చేసినట్టు జంబి హనుమాన్‌ఈవో రవీందర్ తెలిపారు.గతరెండేళ్లుగా దుకాణయజమానులు కిరాయి చెల్లించడం లేదని వాటిని సీజ్ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఎస్ఎస్ఆర్ డిస్కవరిలో స్టూడెంట్స్ కౌన్సిల్ ఎలక్షన్స్



ఓటు వేస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జూలై 6: నగర శివారులోని ఎస్ఎస్ఆర్ డిస్కవరి సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం హెడ్‌బాయ్,హెడ్‌గర్ల్స్‌ను ఎన్నుకోవడానికి స్టూడెంట్స్ కౌన్సిల్ ఎలక్షన్స్‌ను నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వరుస క్రమంలో వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 9వ తరగతి విద్యార్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేయగా 8 మంది బాలురు, 5గురు బాలికలు పోటీ పడ్డారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్, సీఈవో హరితగౌడ్, డైరెక్టర్ హర్షిత్‌గౌడ్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకొని ఓటు చాలా విలువైందని భవిష్యత్తులో విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని మంచి నాయకుడిగా ఎదగాలని రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.265	రూ. 285

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73400	రూ.67,700	రూ.945

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 2.45, 6.30, 10.15)
స్క్రీన్-2 : డిస్పికేబుల్ మి-4 (తెలుగు 3డి) (11.40, 2.00, 4.20, 6.40)
: డిస్పికేబుల్ మి-4 (ఇంగ్లీష్ 3డి) (9.00)
స్క్రీన్-3 : ఎంఎస్ ధోని (హిందీ) (11.30, 10.45)
: కల్కి(తెలుగు) (3.15, 7.00)
స్క్రీన్-4 : కిల్ (హిందీ) (11.15, 1.45, 8.00, 10.30)
: ఎంఎస్ ధోని (హిందీ) (4.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(తెలుగు) (12.25, 3.50, 7.15)
స్క్రీన్-2 : కల్కి(తెలుగు) (10.30)
: కల్కి(3డి తెలుగు) (2.00, 5.30, 9.30)
స్క్రీన్-3 : కల్కి(3డి తెలుగు) (4.05, 7.20, 10.45)

దేవి : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి(హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్